ప్రతిఒక్కరూ క్రీడా స్ఫూర్తిని అలవర్చుకోవాలి

క్రీడలను ప్రారంభిస్తున్న భద్రారెడ్డి

ఘట్‌ కేసర్, ఫిబ్రవరి 16: ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తిని అలవర్చుకుని జాతీయ స్థాయికి ఎదగాలని బీఆర్ఎస్ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి చామకూర భద్రారెడ్డి తెలిపారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ మాదారంలో నిర్వహిస్తున్న మాదారం ప్రీమియర్ లీగ్ సీజన్-6 క్రికెట్ క్రీడలను ఆదివారం ఆయన ప్రారంభించారు. క్రీడా స్ఫూర్తి కలిగిన ప్రతిఒక్కరూ అన్ని రంగాల్లో రాణిస్తారని తెలిపారు. క్రీడల వలన మనిషికి శారీరక, మానసిక ఆరోగ్యం దృఢపడుతుందని చెప్పారు. క్రీడల వల్ల మానవ సంబంధాలు బలపడుతాయని, ప్రతిఒక్కరూ క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. మేడ్చల్ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో క్రికెట్ క్రీడలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి పన్నాల కొండల్ రెడ్డి, మాజీ సర్పంచ్ యాదగిరి, మాజీ కౌన్సిలర్ బండారి ఆంజనేయులు గౌడ్, నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

కులగణనలో వివరాలు ఇవ్వని వారికి మరో అవకాశం

ఘట్‌కేసర్ మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్

ఘట్‌ కేసర్, ఫిబ్రవరి 16: కులగణన సర్వేలో గతంలో వివరాలు ఇవ్వనివారికి నేటి నుంచి ఈనెల 28వ తేదీ వరకు మరో అవకాశాన్ని ప్రభుత్వం కల్పిస్తున్నట్లు ఘట్ కేసర్ మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్ తెలిపారు. ఘట్ కేసర్ మున్సిపల్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. తొలిదశ కుల గణన సర్వేలో కొన్ని కుటుంబాలు తమ వివరాలను నమోదు చేయలేదన్నారు. గతంలో నమోదు చేయని వారి కోసం మరల అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. సర్వే చేసే ఎన్యూమరేటర్లు ఇంటికి రాకపోతే ప్రభుత్వ వెబ్‌సైట్‌లో నుంచి సర్వే దరఖాస్తును డౌన్లోడ్ చేసుకుని వివరాలు నింపి మున్సిపల్ ప్రజాపాలన సేవా కేంద్రంలో ఫిబ్రవరి 16 నుంచి 28వ తేదీ వరకు దరఖాస్తు చేయాలన్నారు. ఘట్‌కేసర్ మున్సిపల్ కార్యాలయంలోని ప్రజాపాలన సేవా కేంద్రంలో ప్రజాపాలన దరఖాస్తులు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు.

జవహర్ నగర్‌లో...

జవహర్‌నగర్, ఫిబ్రవరి 16: కుల గణన సర్వేలో పాల్గొనని వారికి ప్రభుత్వం మరోసారి అవకాశం కల్పిస్తుందని, ప్రజలు సద్వినియోగం చేసుకుని మీ కుటుంబ వివరాలు తెలుపగలరని కమిషనర్ వసంత ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సామాజిక, ఆర్థిక, విద్య, రాజకీయ కుల సర్వేలో పేర్లు నమోదు చేసుకొని కుటుంబాలు స్వచ్ఛందంగా ప్రజా పాలన సేవా కేంద్రం కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేశామని తెలిపారు. ఈనెల 16 నుంచి 28వ తేదీ వరకు దరఖాస్తులు తీసుకుంటామని, ఉదయం 9నుంచి సాయంత్రం 5గంటల వరకు అధికారులు అందుబాటులో ఉంటారని, ఏమైనా సందేహాలు ఉంటే టోల్‌ఫ్రీ నంబర్ 89789 95862కు కాల్ చేయగలరని పేర్కొన్నారు.

వాలీబాల్ క్రీడాకారులకు కిట్లు అందజేత

పోచారం మున్సిపాలిటీ అన్నోజిగూడలో వాలీబాల్ క్రీడాకారులకు ఆట కిట్లు అందజేస్తున్న మాజీ చైర్మన్ కొండల్‌రెడ్డి

పోచారం, ఫిబ్రవరి 16: క్రీడాకారులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తే మరింతగా రాణిస్తారని పోచారం మున్సిపాలిటీ మాజీ చైర్మన్ బి.కొండల్‌రెడ్డి అన్నారు. పోచారం మున్సిపాలిటీ అన్నోజిగూడ వాలీబాల్ క్రీడాకారులకు ఆదివారం సొంత నిధులతో ఇక్కడి తెలంగాణ క్రీడా ప్రాంగణంలో ఆయన వాలీబాల్ కిట్లను అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తే ఉత్సాహంగా క్రీడలు ఆడి తమలోని ప్రతిభ నైపుణ్యాలను ప్రదర్శించే అవకాశం ఉంటుందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం దాదాపు రెండు ఎకరాల ప్రభుత్వ స్థలంలో ఇక్కడ ఏర్పాటు చేసిన జ్ఞాన కేంద్రం, యోగా, ఓపెన్ జిమ్, నడక ప్రాంతాన్ని, బాలీబాల్, క్రికెట్ క్రీడా ప్రాంగణాలను ఇక్కడి యువత ఉపయోగించుకోవాలని సూచించారు. నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

చెంగిచర్ల క్రాంతి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ

బోడుప్పల్, ఫిబ్రవరి 16: బోడుప్పల్ మున్సిపల్ పరిధిలోని కొండపోచమ్మ ఆలయంలో ఆదివారం చెంగిచర్ల క్రాంతి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎల్లేశ్ యాదవ్, జనరల్ సెక్రటరీగా రంజిత్‌గౌడ్, కోశాధికారిగా చంద్రశేఖర్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అగ్గిరమేష్ మరియు పలువురు సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య నాయకులు, కాలనీవాసులు హాజరయ్యారు.

ఈసీఐఎల్ చౌరస్తాలో సుందరీకరణ పనులు వేగంగా చేయాలి

కాప్రా, ఫిబ్రవరి 16: ఈసీఐఎల్ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం సర్కిల్ సుందరీకరణ పనులను వేగవంతం చేయాలని స్ఫూర్తి గ్రూప్ ప్రతినిధులు జీహెచ్ఎంసీ అధికారులను కోరారు. ఆదివారం ఈసీఐఎల్ చౌరస్తాలో జ్ఞానమాల కార్యక్రమం నిర్వహణ అనంతరం స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు గొడుగు యాదగిరిరావు మాట్లాడుతూ.. అంబేద్కర్ స్టాచు సర్కిల్‌ను చిన్నదిగా చేసి సుందరీకరణ చేస్తామని అధికారులు చెప్పడం జరిగిందని, అయితే సర్కిల్ చిన్నదిగా చేస్తూ తవ్వారు కానీ, దాని నిర్మాణ పనులు విపరీతమైన జాప్యం జరుగుతున్నదని ఆరోపించారు. ఈ జాప్యంతో రోజు రోజుకూ ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అంబేద్కర్ జయంతి నాటికి సంపూర్ణంగా సందరీకరణ పూర్తి చేయాలని సూచించారు. అయితే ప్రతి ఆదివారం జ్ఞానమాల కార్యక్రమం నిరంతరాయంగా జరుగుతున్నది. అంతేకాకుండా ఇక్కడ ప్రజానీకం ఏ సందర్భంలోనైనా అంబేద్కర్ విగ్రహానికి దండ వేసి నివాళులర్పించే సంప్రదాయం దీర్ఘకాలంగా కొనసాగుతున్నది. అందువలన త్వరితగతిన నిర్మాణ పనులు పూర్తి చేసి సుందరీకరణ జరపాలని కోరారు. అంతేకాకుండా ఈ సర్కిల్‌లోనే నిలువెత్తు జాతీయ జెండా ఏర్పాటు చేయడం జరిగిందని, కాబట్టి వాటర్ ఫౌంటేన్‌తోపాటు అందమైన అలంకారాలు ఏర్పాటు చేయాలని కోరారు. విగ్రహానికి పూలమాల వేసేందుకోసం నిచ్చెనను రూపుదిద్దవలసి ఉందని, ఈ పనులన్నీటిని ప్రజలకు ఇబ్బంది కలుగకుండా మహనీయునికి నిరంతరాయంగా నివాళులర్పించి ఆయనను స్ఫూర్తిగా తీసుకోవడానికి దోహదపడేలా సుందరీకరణ పనులు వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ రైట్ ప్రొటెక్షన్ సొసైటీ నాయకులు సీహెచ్.నాగేశ్వరరావు, ప్రభుదాస్, యాదగిరి, గగన్‌కుమార్, మురారి గారు, భిక్షపతి మాట్లాడారు.

కీసరగుట్టలో 18న జాతర కో-ఆర్డినేషన్ సమావేశం

కీసర, ఫిబ్రవరి 16: కీసరగుట్ట శ్రీభవాని రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో ఈనెల 18న జాతర కోఆర్డినేషన్ సమావేశాన్ని నిర్వహిస్తున్నామని ఆలయ చైర్మన్ తటాకం నారాయణ శర్మ తెలిపారు. ఈనెల 18న మంగళవారం ఉదయం 10:30 గంటలకు నిర్వహించే సమావేశానికి ముఖ్యఅతిథిగా ప్రభుత్వ చీఫ్ విఫ్ పట్నం మహేందర్‌రెడ్డి విచ్చేస్తున్నారన్నారు. ఈనెల 24వ తేదీ నుంచి వచ్చే నెల మార్చి 1వ తేదీ వరకు నిర్వహించే జాతర వేడుకలకు సంబంధించి వివిధ శాఖల అధికారులతో జాతర ఏర్పాట్లపై సమావేశాన్ని నిర్వహిస్తున్నామన్నారు. అందకు ఆలయ కమిటీ ధర్మకర్తలు, వివిధ శాఖల అధికారులు సకాలంలో హాజరై ఈ సమావేశానికి హాజరుకావాలని తెలిపారు.

ఇంటి పన్ను చెల్లించి ఆదర్శంగా నిలవాలి

ఘట్‌కేసర్ మున్సిపాలిటీలో ఇంటి పన్ను చెల్లిస్తున్న మాజీ చైర్‌పర్సన్ పావని జంగయ్య యాదవ్

ఘట్‌కేసర్, ఫిబ్రవరి 16: ప్రతి ఒక్కరూ తమ ఇంటి పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించడంతోపాటు ఆదర్శంగా నిలవాలని ఘట్‌కేసర్ మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్ తెలిపారు. ఘట్‌కేసర్ పట్టణంలోని తమ నివాసం వద్ద మున్సిపల్ సిబ్బందికి ఇంటి పన్ను చెల్లించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు ఇంటి పన్నులు చెల్లించడం ద్వారా అభివృద్ధి అనుకున్న స్థాయిలో జరుగుతుందని చెప్పారు. ఇంటి పన్ను కట్టినప్పుడే ప్రశ్నించే తత్వం వస్తుందన్నారు. కార్యక్రమంలో జంగయ్య యాదవ్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కీసరగుట్ట శ్రీ ఆర్యవైశ్య నిత్యాన్నదాన సత్రం బ్రహ్మోత్సవాల

ఉత్సవ కమిటీ చైర్మన్‌గా శ్రావణ్‌కుమార్‌గుప్త

కీసర, ఫిబ్రవరి 16: కీసరగుట్టలోని శ్రీఆర్యవైశ్య నిత్యాన్నదాన సత్రం బ్రహ్మోత్సవాల ఉత్సవ కమిటీ చైర్మన్‌గా శ్రావణ్‌కుమార్‌గుప్తను ఎంపికయ్యాడు. ఈ మేరకు కీసరగుట్టలోని ఆర్యవైశ్య నిత్యాన్నదాన సత్రంలో నిర్వహించిన సమావేశంలో ఆర్యవైశ్య లందరూ కలిసి కీసరకు చెందిన మాజీ ఉప సర్పంచ్ ఆర్.శ్రావణ్‌కుమార్‌గుప్తను బ్రహ్మోత్సవాల ఉత్సవ కమిటీ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పలుచోట్ల విద్యుత్ సరఫరా నిలిపివేత

జవహర్‌నగర్, ఫిబ్రవరి 16: 11కేవీ సాయిబాబా ఫీడర్‌లో చెట్లకొమ్మలను కత్తిరించడం, విద్యుత్‌లైన్ల మెయింటనెన్స్ పనుల కారణంగా బాలాజీనగర్ ప్రధాన రహదారి, మహంకాళీరోడ్డు, మోహన్‌రావుకాలనీ, ఆనంద్‌నగర్, మార్కెట్‌రోడ్డు, శాంతినగర్, ముత్తుస్వామికాలనీ, వెంకటేశ్వరకాలనీ, చంద్రపురి కాలనీ, ఫైరింగ్‌రేంజ్ ప్రాంతాల్లో సోమవారం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని బాలాజీనగర్ విద్యుత్ ఏఈ సాంబశివరావు తెలిపారు.

చర్లపల్లి డివిజన్ మధురానగర్ సంక్షేమ సంఘం కమిటీ నియామకం

చర్లపల్లి, ఫిబ్రవరి 16:చర్లపల్లి డివిజన్ మధురానగర్ సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులుగా వంగ కొండల్‌రెడ్డి, వాకిటి అనిలారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాలనీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులుగా ధీరావత్ లింగం నాయక్, కేసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, కోశాధికారిగా మగావత్ శ్రీనివాస్‌నాయక్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా సాయి పంతులు, తాత సుజాత, సంయుక్త కార్యదర్శులుగా విలాసాగర్ సుధాకర్, ఈశ్వర్, హనుమ, నిమ్మ ఉదయ్‌రెడ్డి, సలహాదారులుగా చంద్రశేఖర్, విజయ, శ్రీనివాస్, మంతు నాయక్, కార్యవర్గ సభ్యులుగా అయ్యప్ప, శ్రీవాణి, లావణ్య, తాతారావు, ఉదయ్‌కుమార్, సతీష్, నర్సయ్య, శ్రీకాంత్‌రెడ్డి, హరినాయక్, చంద్రారెడ్డి ఎన్నికయ్యారు. అనంతరం నూతనంగా ఎన్నికైన కార్యవర్గం సభ్యులను చర్లపల్లి కాలనీల సమాఖ్య అధ్యక్షుడు ఎంపెల్లి పద్మారెడ్డి ఘనంగా సన్మానించారు.

అలరించిన నృత్య ప్రదర్శనలు

నృత్యం చేస్తున్న కళాకారులు

ఉప్పల్, ఫిబ్రవరి 16: ఉప్పల్ శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం రమణి సిద్ధి ఆధ్వర్యంలో నెలనెల కళారాధన కార్యక్రమంలో భాగంగా త్యాగరాజ పంచరత్న కీర్తనలు, నృత్య ప్రదర్శన ఏర్పాటు చేశారు. గురువులు నూతి ప్రసూన, రమణి సిద్ధి, బాలాజీకుమార్, రాజేశ్వరి, విశాఖ ప్రకాశ్, మాధవిశర్మ శిష్య బృందం త్యాగరాజ కృతులు, దుడుకుగల నన్నే దొర, ఎందరో మహానుభావులు, గణేశ పంచరత్న, జగదానంద కారక, మొదలైన అంశాలకు కళాకారులూ నృత్య ప్రదర్శన చేపట్టారు. ప్రముఖ నాట్య గురువులు పి.బి.కృష్ణ భారతి ముఖ్యఅతిథిగా విచ్చేసి కళాకారులను అభినందించారు.

మేడ్చల్‌లో భగవద్గీతపై ప్రచారం

మేడ్చల్, ఫిబ్రవరి 16: మాఘ మాసం కృష్ణపక్ష చతుర్దశి నాడు మహా శివరాత్రిగా నిర్ణయించారని ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక హైదరాబాద్ కమిటీ అధ్యక్షుడు గిరి అన్నారు. మేడ్చల్ పట్టణంలోని ఆదివారం గ్రామంలో భగవద్గీతపై ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ పూర్వం నిరాకార పరమాత్మకు గుర్తుగా గర్భగుడి అవసరంలేని నిరాకార పరమాత్మను ఈశ్వర లింగంగా చూపించారన్నారని తెలియజేశారు. అలాగే మాఘపూర్ణిమ భగవంతుని జన్మను తెలియజేస్తుంది అని, సాకార భగవంతుడు కి గర్భగుడి ఉంటుంది తెలిపారు. ఈ కార్యక్రమంలో హిందూజ్ఞాన వేదిక సభ్యులు నర్సింహాచారి, జనార్దన్‌రావు, ఎస్.కుమార్, పాపిరెడ్డి, పవన్, పద్మ, ప్రియ, నాగమణి, చంద్రకళ, మహేశ్, మంజుల, లక్ష్మి, అంజి పాల్గొన్నారు.

ప్రచారం నిర్వహిస్తున్న హిందూ జ్ఞాన వేదిక సభ్యులు

బాలిక విద్యకు లోహియా ఫౌండేషన్ సాయం

మేడ్చల్, ఫిబ్రవరి 16: బాలికల విద్యకు మద్దతు ఇచ్చేందుకు మేడ్చల్ బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కన్హయ్యలాల్ శాంతాదేవి లోహియా ఫౌండేషన్ ఆధునిక డిజిటల్ అభ్యాస సాధనాలతో కూడిన ఎనిమిది ఆధునిక తరగతి గదులతో కొత్త బ్లాక్‌ను ఆదివారం ప్రారంభించింది. ఈ సందర్భంగా కేఎస్ఎల్ ఫౌండేషన్ చైర్మన్, ఫిలాంత్రోపిస్ట్ కన్హయ్యలాల్ లోహియా, చైర్‌పర్సన్ శాంతాదేవి లోహియా మాట్లాడుతూ..బాలికలకు విద్యను అందించడం సరైన పని మాత్రమే కాదు, ఇది మరింత సమగ్రమైన,సంపన్నమైన భవిష్యత్తును సృష్టించడంలో కీలకం అన్నారు. బాలికల విద్యలో మనం పెట్టుబడి పెడితే బలమైన సమాజంలో సృష్టించుకోగలుతామన్నారు. కార్యక్రమంలో లోహియా గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ మహావీర్ లోహియా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



లోహియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నూతనంగా ప్రారంభించిన బ్లాక్

బోడుప్పల్ మాజీ మంత్రి ఎమ్మెల్యే మల్లారెడ్డి సందడి

పీర్జాదిగూడ, ఫిబ్రవరి 16 : బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మాజీమంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి సందడి చేశారు. ఓ కార్యక్రమానికి హాజరైన మంత్రి మల్లారెడ్డి అక్కడ తనకు పాల డబ్బాతో కనిపించిన వ్యక్తి స్కూటర్‌పై కూర్చొని అందరినీ ఆకట్టుకున్నారు. ఒకప్పుడు తాను కూడా స్కూటర్ పైనే పాల వ్యాపారం చేసే వాడినని గతాన్ని గుర్తు చేసుకున్నారు. స్కూటర్ నడుపుతూ, ఫొటోలు దిగుతూ అందరిని ఆకర్శించారు. పాలు అమ్మిన వాళ్లు ఎప్పటికైనా సక్సెస్ అయ్యి తీరుతారంటూ స్కూటర్‌పై పాలమ్ముతున్న ఆ వ్యాపారిని సన్మానించి సంతోషం వ్యక్తం చేశారు.

ఆలయాల్లో సౌకర్యాల కల్పనకు కృషి చేయాలి

మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి


కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, ఆలయ కమిటీ ప్రతినిధులు

చర్లపల్లి, ఫిబ్రవరి 16:నియోజకవర్గ పరిధిలోని ఆలయాలలో సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేయాలని ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి పేర్కొన్నారు. చర్లపల్లి డివిజన్ పరిధిలోని పెద్దచర్లపల్లి సీతారామచంద్రాస్వామి రామాలయంలో ధ్వజస్థంభ ప్రతిష్ట, సుబ్రమణ్యస్వామి, ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ పరిధిలోని ఆలయాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మౌలిక వసతులు కల్పించాలని, పలు డివిజన్లలో ఉన్న పురాతన ఆలయాలను గుర్తించి అభివృద్ధి చేసేందుకు నిధులు కేటాయించాలని ఆయన కోరారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు సంజీవరెడ్డి, కొమ్ము రమేశ్, జాండ్ల సత్తిరెడ్డి, కడియాల యాదగిరి, కొమ్ము నర్సింగ్‌రావు, దర్శనం లక్ష్మయ్య, నాధం, కొమ్ము సురేశ్, కడియాల సురేశ్, అనిల్‌కుమార్, భానుచందర్, పెంటేశ్, రాంబాబులతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విజ్ఞాన ప్రదర్శన

ఉప్పల్, ఫిబ్రవరి 16: నాచారంలో ఏర్పాటు చేసిన విద్యార్థుల విజ్ఞాన ప్రదర్శన ఆకట్టుకున్నది. నాచారంలోని డెక్కన్ స్పింగ్స్ గ్లోబల్ స్కూల్‌లో పలు తరగతుల విద్యార్థులు తమ ప్రతిభ, నైపుణ్యాలను ప్రదర్శించే విధంగా ప్రదర్శనలో నమూనాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల చైర్మన్ నవనీతరావు, మేనేజింగ్ డైరెక్టర్ నవీన్ కుమార్, డైరెక్టర్ డాక్టర్ కమల మనోహర్‌రావు, కోర్ ఆపరేషన్ హెడ్ కిశోర్‌కుమార్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సుమా మీనన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా గణితం, ఇంగ్లిష్, సోషల్ సైన్స్, ఐసీటీ, ఆర్ట్స్, క్రాఫ్ట్, తదితర అంశాల ప్రాజెక్టును ప్రదర్శించారు. విభిన్న రకాలైన ప్రాజెక్టులతో విద్యార్థులు తమ ప్రదర్శనను చేపట్టారు. అనంతరం లిటరసి, స్కూల్ సినిమా, సాఫ్ట్ స్కిల్, మ్యూజిక్, డాన్స్, స్కూల్ లైబ్రరీ, తదితర అంశాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉన్నత లక్ష్యాలతో కృషి చేస్తే అనుకున్న ఫలితాలను సాధించవచ్చని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.